# కూరలు

పెద్ద రాంబాబు కూరల మార్కెట్ అంతా కలయతిరిగి, నవ నవలాడే మంచి లేతవంకాయల ధర విచారించాడు. కిలో రూపాయిన్నర, ఓ కూరలమ్మాయి దగ్గర పది కిలోల వంకాయలు కొన్నాడు. పెద్ద రాంబాబు, తనతో తెచ్చిన చేతిసంచీనిండా ఆ పది కిలోల వంకాయలను నింపుకుని. కూరలమ్మాయికి పదిహేను రూపాయలు ఇచ్చి బయటకి నడిచాడు.

పెద్ద రాంబాబు రెండు చేతులలో రెండు పెద్దచేతి సంచీలున్నాయి. కుడిచేతి సంచి నిండా వంకాయలు, బంగాళాదుంపలు వున్నాయి ఎడంచేతి సంచినిండా పచ్చి మిరపకాయలు, ఉల్లిపాయలు, అల్లంలాంటివి వున్నాయి.

పెద్ద రాంబాబు కూరల మార్కెట్ లోంచి బయటికి వస్తూండగా, గేటుదగ్గర ఎదురుపడ్డాడు చిన్న రాంబాబు రెండు చేతుల్లో, నిండుగా కూరలలో వస్తున్న పెద్ద రాంబాబును చూసి చిన్న రాంబాబు నవ్వి అడిగాడు.

"చాలా చాలా కొన్నట్టున్నావే? ఎవరికో?"

"ఎవరికో ఏమిటి? నాకు ఆఫీసర్ల ఇళ్ళకి కూరలు మోసే అలవాటు లేనేలేదు మాకే ఒక్కసారే కొనుక్కు తీసుకు వెళ్తున్నాను సత్యనారాయణ స్వామి వ్రతానికి."

చిన్న రాంబాబు కూరల మార్కెట్‌లోకి, పెద్ద రాంబాబు తన ఆఫీసర్ ఇంటికి వెళ్ళారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన ఓ ఆఫీస్‌లో పనిచేస్తున్నారు వాళ్ళిద్దరు ఇద్దరి పేర్లూ రాంబాబులే, ఇంటిపేర్లు వేరయినా, మొదటి అక్షరాలు అంటే ఇన్‌షియల్స్ ఒకటే. ఒకర్ని పిలిస్తే మరొకరు పలకడం. జరుగుతుంది కాబట్టి వాళ్ళిద్దరి పేర్లు అనువుగా మార్చారు సహోద్యోగులు

పొడుగావున్న రాంబాబుని పెద్ద రాంబాబు అని. పొట్టిగా వున్న రాంబాబుని చిన్న రాంబాబు అని పిలవటం ప్రారంభించారు ఆ ఇద్దరు రాంబాబులూ ఆ క్రొత్త పేర్లకి బదులు పలకడం కూడా ప్రారంభించారు, ఇష్టే అభ్యంతరం చెప్పకుండా.

పెద్ద రాంబాబు చిన్న రాంబాబు ఇద్దరు తమ ఆఫీసర్‌ని మంచి చేసుకోవడం ఉత్తమం అనే ఆలోచనగల వాళ్ళే. ఇద్దరూ కొత్తగా బదిలీ అయి వచ్చిన ఆఫీసర్‌ని మంచి చేసుకోవడం ప్రారంభించారు. అంతే కాదు. ఒకళ్ళ ప్రయత్నాలకి మరొకరు అడ్డుతగలడం కూడా ప్రారంభించారు. ఎవరికి వారు రెండో వాళ్ళకంటే తను ఎక్కువ మంచివాడుగా గుర్తింపబడాలని తాపత్రయం పడసాగారు.

ఆ ఆఫీసర్ భార్య గట్టి పిండం. ఆవలిస్తే పేగులు లెక్కపెట్టగలిగేంత గట్టిది కాకపోయినా. తన భర్త కింద పనిచేసే ఉద్యోగులని ఎలా ఉపయోగించుకోవాలో బాగా తెలిసిన వ్యక్తి. పిల్లికి బిచ్చం పెట్టనటువంటి పిసినారి. పెద్ద రాంబాబు. చిన్న రాంబాబు ఆఫీసర్‌ని మంచి చేసుకునే ప్రయత్నంలో ఆమె ఆజ్ఞలని శిరసావహించే భక్తులయి పోయారు. వాళ్ళిద్దరి చేత వెట్టి చాకిరీ చేయించుకోవటం నేర్చుకుంది.

పెద్ద రాంబాబుని ఆఫీసర్ పిలిచి, చేతిలో యాభై రూపాయలు పెట్టి మర్నాడు ఇంట్లో సత్యనారాయణ వ్రతం చేసుకుంటున్నామని కూరలు కొనుక్కొని ఇంటికి తీసుకు వెళ్ళమని పని పురమాయించాడు మధ్యాహ్నం ఆఫీసర్ అందించిన డబ్బు, లిస్టు తీసుకుని కూరలు కొని ఆఫీసర్ ఇంటికి తీసుకెళ్ళాడు పెద్ద రాంబాబు.

కూరలు అప్పచెప్పి పెద్ద రాంబాబు చిన్న తెలివయిన అబద్ధం ఆడాడు. కూరలన్నీ ఆ రోజు చవకగా వున్నాయని చెప్పాడు ఆఫీసర్ సతీమణికి ప్రతీ కూర ఖరీదులో పావలా తగ్గించి చెప్పాడు. వంకాయలు కిలో రూపాయి పావలాకే కొన్నట్లుగా అబద్ధం ఆడాడు ఆఫీసరిచ్చిన ఏభై రూపాయలకి లెక్కచెప్పి వెళ్ళిపోయాడు. మిగతా సొమ్ము ఇచ్చేసి. అలా తక్కువ ధర చెప్పటం వల్ల పెద్ద రాంబాబుకి అయిదారు రూపాయల దాకా జేబులోంచి పడ్డది. ఎందుకో అరెరె అన్నది ఆఫీసర్ భార్య.

మర్నాడు వ్రతానికి వెళ్ళాడు పెద్ద రాంబాబు. పెద్ద రాంబాబు వెళ్ళే సరికే వ్రతం మొదలయింది. ఆఫీసర్ భార్య తనని మిర్రిమిర్రి చూడటం

గమనించి మరి కాస ముందర బయలుదేరి వుండాల్సిందని తనని తను తిట్టుకున్నాడు. ఆలస్యానికి తగిన కారణం ఏం చెప్పాలా అనే ఆలోచనలో పడ్డాడు.

పెద్ద రాంబాబు వచ్చిన పావుగంటకి చిన్న రాంబాబు వచ్చాడు. చిన్న రాంబాబు కన్నా తను ముందర వచ్చినందుకు మనసులోనే సంతోషపడ్డాడు పెద్ద రాంబాబు. పైగా ఆలస్యం అయిందేమని ఆఫీసర్, ఆఫీసర్ అర్థాంగి వినేలా పెద్దగా అడిగాడు చిన్న రాంబాబుని.

పూజ అయింది కథ మొదలయింది, మొదటి కథ అయ్యాక ఆఫీసర్ పెళ్ళాం పెద్ద రాంబాబుని ప్రక్కగదిలోకి పిలుచుకు వెళ్ళింది.

"ఏం చేయమంటారు?" అడిగాడు పెద్ద రాంబాబు శ్రద్ధగా. పూమి దానులలాంటివేవో తీసుకురావాల్సి వుంటుందనుకున్నాడు.

నిప్పులు కక్కుతూ చూసింది ఆఫీసర్ శ్రీమతి పెద్ద రాంబాబు కళ్ళలోకి. తనేం తప్పు చేశానో అని కళవిళపడుతూ అడిగాడు పెద్ద రాంబాబు.

"ఆలస్యం అయిందనా? నా సైకిల్ని ఓ స్కూటర్ డేష్ యిచ్చింది. దాన్ని రిపేర్కి యిచ్చి వస్తున్నాను. నిజంగా ఆలస్యం అయింది.

"మా ఆయన ఆఫీసర్ అన్న సంగతి కూడా విస్మరించి ఎన్నాళ్ళనుంచి చేస్తున్నావీ నాటకం?" అడిగింది గట్టిగా.

"ఏం నాటకం" పెద్ద రాంబాబు కళ్ళలో భీతి కనపడింది ఆఫీసర్ బెటర్ హాఫ్ రాలుస్తున్న నిప్పుకణాల్ని చూసి కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి ఆవిడకి.

"పైగా ఏం నాటకం అని నన్ను అడుగుతారే?" అని రేడియో మీద ఎగిరిపోకుండా పెట్టివుంచిన పెద్దగవ్వ కిందవున్న ఓ కాగితాన్ని తీసి యిచ్చింది పెద్దరాంబాబు ఆ కాగితాన్ని అటూయిటూ తిప్పిచూశాడు కాని, అతనికేం పాలుపోలేదు.

"నిన్న కూరలు తెచ్చిన లిస్ట్ ఇది. చిల్లర ఇచ్చేశారా?" అన్నాడు పెగుల్చుకుని.

"ఈ లిస్టుని స్వయంగా మీ చేతితో వేశారు అన్నీ దొంగ రేట్లే ప్రతీకూరమీద పావలానో, పదిపైసలో యెక్కువ వేసుకుని అయిదారు రూపాయలదాకా కమీషన్ కొట్టారు మీరు ఛీ ఛీ అంత కక్కుర్తిపడే బదులు, కూరలు తెచ్చినందుకు ఓ రెండో, మూడో అడిగితే మీ మొహాన పారేసేదాన్నిగా"

వెంటనే ఆవిడ చెప్పింది, బుర్రలోకి సరిగా ఇంకలేదు పెద్ద రాంబాబుకి ఆవిడ కోపాగ్నికి బుర్ర మొద్దుబారిపోయినట్లుగా అయిపోయింది. కొన్ని క్షణాలలో తేరుకుని అన్నాడు:

"రామ, రామ నేనలా చేసేరకం కాదండి. కావాలంటే మీరే మార్కెట్లో రేట్లు విచారించండి. నాకు తెలిసినతని దగ్గర చవకగానే తెచ్చాను."

"పైగా ఇదొకటా? రేట్లు గురించి విచారించే నిలదీసి అడుగుతున్నాను మా ఆయన కూరలకి మిమ్మల్ని పంపించారని తెలియక నేను చిన్నరాంబాబుగారికి లిస్టు, డబ్బు ఇచ్చి పంపాను మీరెళ్ళిన కాసేపటికి ఆయనా కూరలు తెచ్చారు: ప్రతీదానికి మీరు వేసిన రేటుకన్నా పదిపైసలో, పావలానో, తక్కువకి కొన్నారాయన: బేరం ఆడితే యింకా చవకలో తెచ్చేవాడననీ, బేరం ఆడే టైంలేక తీసుకువచ్చానని చెప్పారాయన పాపం, వున్నది వున్నట్టుగా, ఆ కూరలు వృధాకాకుండా ఆయనే మళ్ళీ అమ్మిపెట్టేరు తెలిసినవారికి. అయినా నాకు తెలీకడుగుతాను. కిలో వంకాయలు రూపాయిపావలానా? చిన్నరాంబాబుగారు తొంభైపైసలకే తెచ్చారే మరీ అంత తేడా ఉంటుందా?"

తెల్ల మొహం వేసి చూస్తుండిపోయాడు పెద్ద రాంబాబు. బాణంలా బయటకు వెళ్ళిపోయింది ఆఫీసర్ భార్య, తేరుకుని మళ్ళీ వ్రతం జరుగుతున్న గదిలోకి వచ్చాడు పెద్దరాంబాబు చిన్నరాంబాబు తిట్లుతిన్న పెద్ద రాంబాబుని చూసి ముసిముసిగా నవ్వుకున్నాడు.

*